మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

డీఆర్డీవో నరేశ్

మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఆర్డీవో నరేశ్, రవికుమార్

మహదేవపూర్, జూలై 25 : మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్డీవో నరేశ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో చిరు ధాన్యాలతో తినుబండారాల తయారీలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన 30 మంది మహిళా సంఘాల సభ్యులకు నాబార్డు ఏజీఎం రవికుమార్ అధికారులతో కలిసి సర్టిఫికెట్స్ అందజేశారు. చిరు ధాన్యాలతో తయారు చేసి ప్రదర్శించిన తినుబండారాలను పరిశీలించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం రవీందర్, సీడీపీవో రాధిక, వెలుగురేఖ సీఈవో రజిత పాల్గొన్నారు.

మహిళలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

కాటారం, జూలై 25 : మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ డీడీఎం రవికుమార్ అన్నారు. మండలకేంద్రం లో నాబార్డ్ సహకారంతో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ హై దరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగుల తయారీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎం మాట్లాడుతూ నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణలో పాల్గొనే మహిళలకు స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. శిక్షణ కాలం అనంతరం సర్టిఫికెట్లు అందజేసి అర్హులకు నాబార్డ్ ద్వారా బ్యాంక్ రుణం ఇప్పించి సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. సెర్ప్ మండల ఏపీఎం లవకుమార్, సీసీ లు విజిత, స్వర్ణలత, శిక్షణ కేంద్రం కో-ఆర్డినేటర్ సూర్వదేవర వనిత పాల్గొన్నారు.

పింఛన్లలో 'చిల్లర' దోపిడీ

- లబ్ధిదారులకు రూ.16 ఇవ్వని తపాలా అధికారులు
- 3,571 మంది వద్ద ప్రతి నెలా రూ.57,136
- ఇన్సూరెన్స్ పేరుతో అదనపు కట్టింగ్

ములుగు పోస్టాఫీస్ వద్ద పింఛన్ కోసం క్యూలో లబ్ధిదారులు

ములుగురూరల్, జూలై 25 : ఆసరా పింఛన్ల పంపిణీలో కొందరు తపాలా శాఖ ఉద్యోగులు చిల్లర దోపిడీకి పాల్పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఇచ్చే పింఛన్‌ను పోస్టాఫీస్‌లకు అనుసందానం చేసింది. దీంతో లబ్ధిదారులు కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ములుగు మండల వాప్తంగా 3,571మంది లబ్ధిదారులు ఉండగా వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ. 2,016, దివ్యాంగులకు రూ.4,016 ప్రభుత్వం అందిస్తున్నది. ఈడీఎంసీ, బీపీఎంలు పింఛన్ ఇచ్చే సమయంలో రూ. 16 ఇవ్వకుండా వారే తీసుకుంటున్నారని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఇలానే జరుగుతున్నదని వాపోతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే టెక్నికల్ ఇష్యూ, వేలి ముద్రలు పడటం లేదని, డబ్బులు కొన్నే వచ్చాయనే సాకును చూపుతూ మరుసటి రోజు రావాలని వెనక్కి పంపుతున్నారని ఆరోపిస్తున్నారు. ములుగు జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయం పక్కనే ఉన్న తపాలా కార్యాలయంలో ఈడీఎంసీ పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా రూ.16 అడిగిన వారిని చిల్లర ఇస్తేనే ఇస్తానంటూ బెదిరించడంతో చేసేది ఏమీ లేక వెళ్లిపోతున్నామని చెప్తున్నారు. జిల్లా కేంద్రంలో 568 మంది నుంచి ఇక్కొక్కరి వద్ద రూ.16 చొప్పున రూ.9.088 కాజేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నా యి. దీంతో పాటు మహ్మద్‌గౌసిపల్లి గ్రామంలో బీపీఎం ఇన్సూరెన్స్ పేరుతో నాలుగేళ్లుగా కొందరి నుంచి రూ. వెయ్యి, మరి కొందరి నుంచి రూ. 500 నెలనెలా కట్ చేస్తున్నాడని పింఛన్ దారులు పేర్కొంటున్నారు. ఇన్సూరెన్స్ సంబంధించిన రసీదులు కానీ, ఆధారం ఉన్న పత్రం తమకు ఇవ్వడంలేదని చెప్తున్నారు. తమకు రసీదు ఇవ్వాలని అడిగితే రేపు, మాపు అంటూ దాటవేస్తున్నాడని ఆరోపించారు. ఇలా చూస్తే మండల వ్యాప్తంగా మొత్తం 3571 మంది నుంచి రూ. 16ల చొప్పున మొత్తం 57,136 డబ్బులు కాజేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి డబ్బులు తీసుకుంటున్న వారిపై చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేసి ఇవ్వాలని పింఛన్‌దారులు కోరుతున్నారు. ప్రభుత్వం నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోనే పింఛన్ జమ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆరోపణలు సరికాదు

నాపై వచ్చిన ఆరోపణలు ఫాల్స్. నేను ఏడు సంవత్సరాల నుంచి ఆసరా పింఛన్ డబ్బులు లబ్ధిదారులకు ఇస్తున్నాను. వారి వద్ద రూ. 16 తీసుకోవడం లేదు. ఉదయం 6 గంటలకే వచ్చి పింఛన్ ఇప్పుడు స్టార్ట్ చేస్తున్నా. ఆ రోజు క్యాష్ లిమిట్‌ను బట్టి పంపిణీ ఉంటుంది. సిగ్నల్ సరిగా లేకపోతే మరుసటి రోజు రమ్మని చెప్తున్నా.

- రజనీకాంత్, ఈడీఎంసీ, ములుగు

శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వద్దు : ఎస్పీ

మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ, జూలై 25 : శాంతి భద్రతల పరిక్షణలో అలసత్వానికి తావివ్వకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ఎస్పీ నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసుల పురోగతి, కేసుల సత్వర ఛేదనకు పోలీస్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో త్వరగా విచారణ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్ రెడ్డి, నారాయణనాయక్, సుభాష్ బాబు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో ఇంటింటా సర్వే

వాజేడు, జూలై 25 : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన బొగ్గుల కాంచన (50) విషజ్వరంతో మృతి చెందిన నేపథ్యంలో మేల్కొన్న వైద్యాధికారుల బృందం జగన్నాథపురంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మహేందర్ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేసి, యాంటి లార్వా పిచికారీ పనులతో పాటు నీటి నిల్వలను గుర్తించి పారబోశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యప్రకాశరావు, హెల్త్‌సూపర్ వైజర్స్ కోటిరెడ్డి, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ శేఖర్, ఏఎన్ఎం ఛాయాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజలకు సేవ చేయాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- ప్రభుత్వ దవాఖాన, కేజీబీవీ పాఠశాలల తనిఖీ

వైద్యాధికారిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

రేగొండ, జూలై 25 : ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. గురువారం ఆయన మండలంలోని ప్రభుత్వ దవాఖానను సందర్శించి వైద్యాధికారి హిమబిందును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ గది, నర్సింగ్ రూములను పరిశీలించారు. అనంతరం స్థానిక పాఠశాలలో ఆమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఆహారాన్ని రుచి చూశారు. తరగతి గదులను పరిశీలించి సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఎప్పుడూ ప్రజలు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తూ వైద్య సేవలందించాలన్నారు. విద్యార్థులకు వేడితో కూడిన నాణ్యమైన ఆహార పదార్థాలు వడ్డించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీఈవో రాజేందర్, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అటవీ సంపదను కాపాడాలి : డీఎఫ్‌వో

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న భూపాలపల్లి డీఎఫ్‌వో వసంత

మహదేవపూర్, జూలై 25 : అటవీ సంపదను కాపాడాలని డీఎఫ్‌వో జే వసంత ఆ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలకేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నర్సరీలను ఆమె పరిశీలించారు. నర్సరీలో ప్రత్యేకంగా పెంచుతున్న శ్రీగంధం వివిధ, రకాల మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, ఎఫ్ఆర్‌వో కమల, డీఆర్‌వో రాజేశ్వర్‌రావు, బీట్ అధికారులు సంజీవ్, రమేశ్, టీఏ శేఖర్ పాల్గొన్నారు.

వైద్యాధికారుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, జూలై 25 : ములుగు మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న 98 వైద్యుల పోస్టులకు అర్హులైన వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బీ మోహన్‌లాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ కళాశాలలో పనిచేసేందుకు 15 మంది ప్రొఫెసర్లు, తొమ్మిది మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 55 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు 19 సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల పోస్టులకు నేటి నుంచి ఆగస్టు 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో పోస్టుల భర్తీ ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సింగరేణిలో అధికారుల ఆధిపత్యం

కృష్ణకాలనీ, జూలై 25 : సింగరేణిలో అధికారులు ఆధిపత్య ధోరణితో కార్మికులు విలవిలలాడుతున్నారని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడు నెలలు గడుస్తున్నా గెలుపొందిన కార్మిక సంఘాలకు గుర్తింపు పత్రం రాకపోవడంలో అంతర్యమేమిటి? గెలుపొందిన సంఘాలు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ప్రాతినిధ్య సంఘాల నాయకుల సొంత పనులు యథావిధిగా నడుస్తున్నాయని, దీనిని ఆసరా చేసుకున్న అధికారులు కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతునారన్నారు. గని స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందిచడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్ యూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కృష్ణకాలనీ, జూలై 25: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో పలిమెల మండల ప్రజలకు సౌకర్యాల కల్పనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల మండలమైన పలిమెల అభివృద్ధికి శాఖల వారీగా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ఇటీవల మండలంలో పర్యటించగా ప్రజలు పలు సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దమ్మూరులో వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని, మోదేడు, కమాన్‌పల్లి, బోడాయిగూడెం గ్రామాల్లో గిరి వికాసం పథకం కింద బోర్లు వేయించి గోదావరి నుంచి వ్యవసాయ క్షేత్రాలకు పైప్ లైన్ ద్వారా నీరందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలకేంద్రంలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తేవాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. కలుషిత నీరు తాగి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆర్‌వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధమైన నీరు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌వో మధుసూదన్, డీఆర్డీవో నరేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, ఆర్డీవో మంగీలాల్ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల నిరసన

చిట్యాల, జూలై 25 : బదిలీలు చేపట్టాలని కోరుతూ మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 ఏండ్లుగా ఒకే పాఠశాలలో పని చేస్తున్న తమకు ఇంత వరకు బదిలీలు చేపట్టలేదన్నారు. జీతాలు 010పద్దు కింద చెల్లించాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాలు, నోషనల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాకేశ్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, రఘుపతి, మంజూల, ఉపేందర్, కుమారస్వామి, రమేశ్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య విధులు నిర్వర్తించాలి

మహదేవపూర్, జూలై 25 : పారిశుధ్య విధులు పక్కాగా నిర్వర్తించాలని ఎంపీవో ప్రసాద్ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని బెగ్లూర్ జీపీని సందర్శించి పలు రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద నిర్వహించిన క్లోరినేషన్ పక్రియను పరిశీలించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలన్నారు. వన మహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి

గణపురం, జూలై 25: మండలంలోని గాంధీనగర్ మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల ఆశ్రమ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొగిల జితేందర్, ప్రధాన కార్యదర్శి కండె రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు పాఠశాలను సందర్శించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి సదయ్య, గాంధీనగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు విక్రమ్ పాల్గొన్నారు.

మహదేవపూర్ సీఐగా రామచంద్రరావు

మహదేవపూర్, జూలై 25 : మహదేవపూర్ సీఐగా రామగుండం కమిషనరేట్ పరిధిలో సీసీఎస్-3లో సీఐగా పని చేస్తున్న కే రామచంద్రరావు నియమితులయ్యారు. ఈ మేరకు మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కాళేశ్వరం కీచన ఎస్సై ఘటన, మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఓ రాజకీయ నాయకుడు చేసిన నృత్యం సంఘటనలతో అప్పటి సీఐ రాజేశ్వర్‌రావును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నూతన సీఐగా రామచంద్రరావు రానున్నారు

మావోయిస్టులకు సహకరించొద్దు

ఏటూరునాగారం, జూలై 25 : మండలంలోని రాంనగర్, లంబాడీతండా గ్రామాల్లో మావోయిస్టులకు సహకరించొద్దంటూ పోలీసులు గురువారం ప్రచారం చేశారు. ఈ మేరకు ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రధాన కూడలి వద్ద సమావేశాలు ఏర్పాటు చేసిన మావోయిస్టుల కరపత్రాలు అందజేశారు. మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసులు తీర్చుతారని, ప్రజల కోసం పోలీసులు పనిచేస్తున్నారని తెలిపారు.

ఎన్‌కౌంటర్‌తో ఉలిక్కిపడిన ప్రజలు

తాడ్వాయి, జూలై 25 : ములుగు-భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దు గుండాల మండలం దామెరతోగు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌తో మండల ప్రజలు ఉలిక్కిపడ్డారు. స్పెషల్ పార్టీ పోలీసులు మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన మావోయిస్టు యాక్షన్ టీమ్ సభ్యుడు అశోక్ మృతి చెందాడు. తెలంగాణలో మావోయిస్టుల అలజడి పదేళ్లుగా తగ్గిపోగా గురువారం ఉదయం మండల సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్ జరగడం చర్చనీయాంశమైంది. ఘటనా స్థలం నుంచి మరికొందరు మావోయిస్టులు తప్పించుకున్నారనే విషయం తెలిసి మండలంలోని అటవీ ప్రాంతంలో పోలీసులు ముమ్మర సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఏజెన్సీ వాసులు భయాందోళన చెందుతున్నారు.

రైతులతో అధికారుల ముఖాముఖి

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

గణపురం, జూలై 25 : మండలంలోని మైలారం గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, జిల్లా ఉద్యానవన అధికారి సంజీవరావు రుణమాఫీ పొందిన రైతులతో గురువారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రూ. లక్ష లోపు రుణం పొందిన 62 మందికి మాఫీ వర్తించిందన్నారు. మండలంలో 1,974 మంది మాఫీ అయినట్లు చెప్పారు. మిరుప పంటలో సమగ్ర యాజమాన్య సంరక్షణ చర్యలు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, వెంకటేశ్వరస్వామి, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఫిర్యాదుల స్వీకరణ

వెంకటాపూర్, జూలై 25 : ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీపై సందేహాలుంటే రైతువేదికలో ఫిర్యాదు చేయాలని ఏడీఏ శ్రీపాల్ సూచించారు. గురువారం మండల కేంద్రలంలోని రైతువేదికలో ఏవో కల్యాణితో కలిసి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా లక్షలోపు రుణమాఫీ తొలివిడతలో జరిగిందని, రుణమాఫీపై రైతులకు సందేహాలుంటే ఆయా గ్రామాల్లోని రైతువేదికల్లో ఏఈవోలకు పట్టదారు పాసుబుక్, ఆధార్ కార్డులతో వచ్చి సంప్రదించాలని సూచించారు.

వైద్యశాలకు బెడ్స్, వీల్ చైర్ అందజేత

ఏటూరునాగారం, జూలై 25 : మండల కేంద్రానికి చెందిన నాగుల రవీందర్ జ్ఞాపకార్థం సామాజిక వైద్యశాలకు ఒక బెడ్, సెక్షన్ మిషన్, వీల్‌చైర్‌తో పాటు వైద్య పరికరాలు గురువారం కుటుంబసభ్యులు అందజేశారు. నాగుల రవీందర్ పంచాయతీ రాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందారు. కాగా, ఆయన జ్ఞాపకార్థం భార్య చంద్రకళ, కుటుంబ సభ్యులు సింధూజా, అనూష, దిలీప్, సాయికిరణ్, అలువాల శ్రీనువాస్ వైద్యశాలకు గురువారం అందజేశారు.

సామగ్రి అందజేస్తున్న కుటుంబ సభ్యులు

ఉద్యాన పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

కృష్ణకాలనీ, జూలై 25: జిల్లాలో ఈ సంవత్సరం ఉద్యాన పంటలు పండించే రైతులు స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులతో సర్వే నంబర్ వారీగా పంటల వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయల సాగు, ఆయిల్ ఫామ్, మిర్చి, పండ్లతోటలు తదితర పంటల సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. జిల్లాలో నూతనంగా ఉద్యాన పంటలు సాగు చేసేవారు తప్పనిసరిగా పంటల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

గిరిజనుల అభివృద్ధిని మరిచిన కేంద్రం

వెంకటాపురం(నూగూరు), జూలై 25 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెల్‌లో గిరిజనుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆదివాసీ నవ నిర్మాణ సేవా రాష్ట్ర అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి గురువారం అన్నారు. సబ్‌ప్లాన్ నిధులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీని కేంద్ర ప్రభుత్వం ఆటోగతి పాలు చేసిందన్నారు. గిరిజనుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు అంకెల గారడి చేసి, నమ్మించే ప్రయత్నం చేసిందని తెలిపారు.

ఎల్ ఈడీ లైట్లను వినియోగించుకోవాలి

గోవిందరావుపేట, జూలై 25 : తక్కువ విద్యుత్ ఎక్కువ వెలుగునిచ్చే ఎల్‌ఈడీ లైట్లను వినియోగించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ సూచించారు. మండలంలోని చల్వాయి ఆదర్శ పాఠశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ములుగు జిల్లా ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో మినిస్టరీ ఆఫ్ ఎన్విరాల్‌మెంట్, ఫారెస్టు క్లైమెట్‌చేంజ్ భారత ప్రభుత్వం వారి సేవ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయదేవ్ మాట్లాడుతూ ఎల్ ఈడీ, ట్యూబ్‌లైట్ల వాడకంతో విద్యుత్ శక్తి వినియోగం తగ్గించి విద్యుత్ శక్తిని పొదుపు చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఎల్ ఈడీ, ట్యూబ్‌లైట్లను ఎలా తయారు చేయాలో, వర్మీకంపోస్టుల ప్రాధాన్యతపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి 50 నేషనల్ గ్రీన్ కార్డ్ పాఠశాల నుంచి పాల్గొన్నారని తెలిపారు. మండల నోడల్ అధికారి కే సోమారెడ్డి, ములుగు జిల్లా భౌతిక శాస్త్రం ఫోరం అధ్యక్షుడు సతీశ్ కుమార్, మధుసూదన్, బండారుపల్లి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మతో పాటు గైడు టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి

కాళేశ్వరం/ కన్నాయిగూడెం, జూలై 25 : మహారాష్ట్రలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కాళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా ఉంది. ప్రాణహిత నది నుంచి ఉదయం నుంచి సాయింత్రం వరకు 7.71లక్షల క్యూసెక్కులుగా వస్తుంది. ప్రవాహం 11.01 మీటర్ల ఎత్తు దాటి పారుతూ లక్ష్మీ బరాజ్ వైపు పరుగులు తిస్తున్నాయి. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతూ 82.90 మీటర్లకు చేరుకుంది. ఎగువనుంచి 9,50,420 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బరాజ్ మొత్తం 59 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

రైతులు, కూలీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

ములుగురూరల్, జూలై 25 : ఎన్నికల ముందు కౌలు రైతులకు రూ. 15 వేలు, రైతు కూలీలకు ఏడాదికి రూ. 12వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ఇన్‌చార్జి పెద్ది మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రస్తుతం ఒక లక్షలోపు మాత్రమే మాఫీ చేశారన్నారు. రైతులకు బీజేపీ ఎల్లప్పుడు మద్దతుగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు గాదం కుమార్, నాయకులు రవీంద్రాచారి, జాడి రామరాజు, కృష్ణకర్‌రావు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

ములుగురూరల్, జూలై 25 : చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్‌కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. గురువారం మండలంలోని అబ్బాపురంలో వ్యవసాయ కూలీలకు న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా చట్టాలపై అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగులు వల్ల నష్టం వాటిల్లినప్పుడు, మార్కెట్‌లో మోసాలు జరిగినప్పుడు, పంట బీమా అందనప్పుడు పలు సందర్భాల్లో చట్టాలతో రైతులకు అవసరం ఏర్పడుతుందని తెలిపారు. ఉచిత న్యాయం, వివిధ హక్కులపై అవగాహన ఉండాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్‌కుమార్ ప